పాలకుల దృక్పథం మారాలి



వైద్య ఆరోగ్య రంగంపై పాలకుల దృక్పథం మారి బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించగలిగితే డాక్టర్లు, నర్సులు సురక్షితంగా విధులు నిర్వహించగలుగుతారు. మన పక్కదేశమైన చైనాలో ఆరోగ్యానికి 7 శాతం కు పైగా నిధులు కేటాయిస్తుండగా మనదేశంలో 2.4 శాతమే నిధులు కేటాయించుకోగలుగుతున్నాం. నిధులు పెరిగితే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో పేషెంట్ల కోసం పనిచేసే డాక్టర్లకు కావల్సిన ప్రత్యేకరూంలు, బెడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించుకునే అవకాశం ఉంటుంది. హాస్పిటళ్లు ఉన్న ప్రదేశాలను సేఫ్‌జోన్‌లుగా ప్రకటించి వచ్చే పేషెంట్ల బంధువులకు పాస్‌లు మంజూరు చేసి అనుమతించాలి.

–డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, హృద్రోగ నిపుణులు, ఐఎంఎ సంయుక్త కార్యదర్శి

శిక్షలు కఠినంగా ఉండాలి



డాక్టర్లపై దాడులు చేస్తే వెంటనే కఠినమైన శిక్షలు పడతాయనే భయం ఉంటే కోల్‌కతా వంటి సంఘటనలు జరగవు. ప్రభుత్వ హాస్పిటళ్లు, మెడికల్ కళాశాలల్లో సౌకర్యాలు చాలా పూర్‌గా ఉంటున్నాయి. కనీసం డోర్‌లాక్‌లు కూడా సరిగ్గా ఉండవు. అవే సరిగా ఉంటే కోల్‌కతా సంఘటన జరిగి ఉండేది కాదు. డాక్టర్లకు పోలీసుల సహకారం చాలా అవసరం. కాబట్టి కఠినమైన చట్టాలు, అవి అమలుతీరు పకడ్బందీగా ఉంటే డాక్టర్లపై దాడులు జరగవు.

–డాక్టర్ నాగోతు ప్రకాష్, ఎండీ, ఐఎంఏ అధ్యక్షులు, నరసరావుపేట

క్లుప్తంగా

వీఆర్వో కుటుంబాన్ని పరామర్శించిన తహసీల్దార్



నాదెండ్ల: తూబాడు వీఆర్వో విప్పర్ల కోటేశ్వర రావు (54) మృతి బాధాకరమని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. మండలంలోని సొలస గ్రామంలో కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ.25 వేలను మట్టిఖర్చుల నిమిత్తం తీసుకున్నారు. శాఖాపరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, వీఆర్వోల సంఘ నాయకులు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో నిర్మలా స్కూల్ విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 23న జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో పట్టణానికి చెందిన నిర్మలా స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.హర్ష (అండర్–16) 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించాడు. ఎ.వెంకటరెడ్డి (అండర్–14) 600 మీటర్ల పరుగుపందెంలో 3వ స్థానం సాధించాడు. సెప్టెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బి.హర్ష పాల్గొంటారని సిస్టర్ సెలీన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అథ్లెటిక్స్ కోచ్ డి.అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు పవన్, కరస్పాండెంట్ సిస్టర్ సిసిలి, ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్.రాణిగోవిందు, సిస్టర్ బెనడిక్టా, సిస్టర్ ఎల్సీ చాకో అభినందించారు.

గోసంరక్షణ ఆశ్రమం నిర్మాణానికి విరాళం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద వేంచేసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి విశ్వమాత గోసంరక్షణ ఆశ్రమ నిర్మాణానికి పట్టణానికి చెందిన షేక్ జానీ రూ.1.01,116లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన తండ్రి ఎస్కే మహబూబ్ బాషా మాస్టర్ జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి, బద్దిక నరసింహారావు, వెంకటేశ్వర్లు, రాము, మహిళా భక్తులు పాల్గొన్నారు.

కొత్తపాలెం సర్పంచ్‌గా మానం సాంబయ్య



నాదెండ్ల: మండలంలోని కొత్తపాలెం గ్రామ ఉపసర్పంచ్ మానం సాంబయ్యకు సర్పంచ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఈయనకు పల్నాడు జిల్లా డీజీపీవో పి.రమణయ్య నుంచి ఉత్తర్వులు అందాయి. ఇటీవల కొత్తపాలెం సర్పంచ్ ఎం వెంకట సుబ్బారావు మృతి చెందిన సంగతి విదితమే. సర్పంచ్ బాధ్యతలను సాంబయ్యకు అప్పగిస్తూ ఈవోపీఆర్డీ కౌంటర్ సంతకంతో నిధులు డ్రా చేసుకునే అధికారం కల్పించారు. సర్పంచ్ బాధ్యతలను చేపట్టిన సాంబయ్యను వార్డు సభ్యులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కృష్ణవేణి విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పిడి ఈదర ఆదిబాబు శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో తమ విద్యార్థి జి.ధర్మతేజ అండర్ -20 విభాగం 800 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకం, పి.శివకృష్ణ 10 కిలోమీటర్లు పరుగు పందెంలో రజిత పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సెప్టెంబర్ 14, 15 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఉమ్మడి గుంటూరుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

గదులు చాలవు.. చదువు సాగదు!!

- మేళ్లవాగు హైస్కూల్లో తరగతి గదుల కొరత
- విద్యార్థుల సంఖ్య 190
- ఉపాధ్యాయులు ఐదుగురు
- తరగతి గదిగా స్టోర్ రూము!



మేళ్లవాగు హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదులు

బొల్లాపల్లి: మండలంలోని మేళ్లవాగు ఉన్నత పాఠశాలలో చాలీచాలని తరగతి గదులతో విద్యార్థులకు అగచాట్లు తప్పడం లేదు. పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు, 190 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతి గదులు సరిపడక స్టాఫ్‌రూమ్‌నే తరగతి గదిగా, స్టోర్ రూమ్‌గా ఉపయోగించుకుంటున్నారు. నాడు–నేడులో భాగంగా సెకండ్ ఫేజ్‌లో 2 తరగతి గదులు మంజూరై అసంపూర్తి నిర్మాణంతో నిలిచాయి. అదేవిధంగా 2017–18లో అప్పటి ప్రభుత్వం హయాంలో మూడు గదులు మంజూరయ్యాయి. అరకొర నిర్మాణంతో అసంపూర్తి నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యార్థులకు గదుల కొరత ఏర్పడింది. తరగతి గదులతో పాటు బాలురకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. నాడు–నేడులో భాగంగా వంట గది సైతం శ్లాబ్, గోడల నిర్మాణంతో నిలిచిపోయింది. మేళ్లవాగు హైస్కూల్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించి తరగతి గదుల కొరత లేకుండా చూడాలని, విద్యార్థుల ఇబ్బందులు గమనించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తి నిర్మాణంలో ఉన్న వంట గది

మరికొన్ని అవసరం

6 నుంచి 10వ తరగతి వరకు 190 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి మరో నాలుగు తరగతి గదులు అవసరం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తరగతి గదులు పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యాలు అమరినట్లే. వంట గది, బాత్‌రూమ్‌లు అసంపూర్తి నిర్మాణంతో ఉన్నాయి.

– యాకోబ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు

కఠిన చట్టాలతోనే మహిళల భద్రత

- ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ
- మహిళా డాక్టర్‌కు నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

నరసరావుపేట: మహిళల భద్రతకు కఠిన చట్టాలు చేసి పకడ్బందీగా అమలుచేయాలని పలువురు నాయకులు కోరారు. శనివారం కేబీఆర్ ధర్నా చౌక్ వద్ద నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ బొమ్మ దగ్గర మానవహారం ఏర్పాటు చేశారు. వైద్యురాలి మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. కోల్‌కత్తాలో ఆర్‌జీకార్ మెడికల్ కళాశాలలో మహిళా డాక్టర్‌పై చోటు చేసుకున్న హత్యాచారాన్ని ఖండిస్తూ స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్త్రీలను పూజించే దేశంలో వారిపై ఘోరమైన అత్యాచారాలు, హత్యలు చోటు చేసుకోవటం ఆందోళనకరమన్నారు. డ్యూటీలో ఉన్న వైద్యురాలిని అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి హత్యగావించటం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.

ఎఫ్.ఐ.ఆర్. నమోదు, నిందితుల గుర్తింపు, నేరం జరిగిన ప్రాంతంలో సాక్ష్యాలను కాపాడటంతో పోలీసుశాఖ విఫలమైందన్నారు. సాక్షాత్తు దేశ సర్వోన్నత న్యాయస్థానం కేసును సుమోటాగా స్వీకరించి విచారణ ప్రారంభించి కలకత్తా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. దేశంలో ప్రతి రోజూ అనేక ప్రాంతాల్లో బాలికలు, మహిళలు హింసకు, లైంగిక వేధింపులకు గురౌతున్నారన్నారు.

దేశంలోని ప్రతి ఒక్కరూ మతాలకు, కులాలకు, ప్రాంతాలకు, అతీతంగా కలిసికట్టుగా పనిచేస్తేనే దేశంలో స్త్రీల భద్రత, అన్ని వర్గాల ప్రయోజనాలు సాధ్యమౌతాయన్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయటంతో పాటూ, ఆయా చట్టాలను సరిగా అమలు చేసినపుడే మహిళలను రక్షించగలమన్నారు. వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నరసరావుపేట మహిళా కార్యదర్శి చంద్రవల్లి, యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యదర్శి శ్రీనునాయక్, ఆఫీసర్ ఫెడరేషన్ కార్యదర్శి రాముడు, సమైక్యా ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.కె. జిలాని మాలిక్, వివిధ బ్యాంకుల యూనియన్ నాయకులు, మహిళా ఉద్యోగుల నాయకులతో పాటు ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపిక



ఉప్పు బసవరాణి | పట్రా దేవమణి | ఓర్సు మరనాధరావు

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో పదోవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి రెండవ సారి ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ సీట్లు ముగ్గురు విద్యార్థులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి శనివారం తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు సీట్లు సాధించినట్లు చెప్పారు. ఉప్పు బసవరాణి–నూజివీడు (క్రీడా విభాగం) పట్రా దేవమణి–నూజివీడు (దివ్యాంగుల విభాగం) ఓర్సు మరనాధరావు –ఒంగోలు (సాధారణ విభాగం) సీట్లు సాధించినట్లు తెలిపారు. మొదట విడతలో కన్నెదారి కళ్యాణ్, చెవల చంద్రశేఖర్, గొల్లపూడి అభినయవర్ధన్ ఎంపిక అయినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సమిష్టి కషితో పాటు విద్యార్థులు దృఢ సంకల్పం, పట్టుదల, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించటం ద్వారా ట్రిబుల్ ఐటీలో మండల స్థాయిలో ఆరు సీట్లు సాధించటం మంచి శుభాపరిణామమన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్ కుమార్, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, ఉపాధ్యాయులు సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు కుమ్మరి శ్రీనివాసరాజు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, సురేష్ నిర్మల ,భువనేశ్వరీ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

నరసరావుపేట రూరల్: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ సి.హెచ్.కిశోర్ తెలిపిన వివరాలు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో జొన్నలగడ్డ రోడ్డులోని ఆర్కె రెస్టారెంట్ వద్ద ఆదివారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అశోక్ లైలాండ్ వాహనంలో తనిఖీలు చేయగా రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాహనంలోని 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వాహన డ్రైవర్ గోరంట్ల శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారించారు. గంగన్నపాలెం నుంచి బియ్యాన్ని తీసుకు వస్తున్నట్టు డ్రైవర్ తెలిపాడు. డ్రైవర్‌తో పాటు అక్రమ బియ్యం రవాణ నిర్వాహకుడు జల్లెపల్లి అనిల్‌మోహన్ యేసుబాబును అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూశాఖకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

నీట్‌గా ర్యాంకు సాధించారు!!

నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షల్లో ఆర్ఎంపీ కుమారుడికి ర్యాంక్ !



నందూరి హరికృష్ణరాజు | రెడ్డి భార్గవి

ఈపూరు: ఆల్ ఇండియా నీట్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో 3450 ర్యాంక్ సాధించిన ఘనత మండలంలోని బొగ్గరం గ్రామానికి చెందిన యువకుడికి దక్కింది. గ్రామానికి చెందిన నందూరి ఆంజనేయరాజు ఆర్ఎంపీ డాక్టర్‌గా చేస్తున్నాడు. ఆయన కుమారుడు హరికృష్ణరాజు ఆల్ ఇండియా నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షల్లో 3 లక్షల మంది రాయగా గత శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో హరికృష్ణరాజు 3450 ర్యాంక్ సాధించి అందరి మన్ననలు పొందారు. హరికృష్ణరాజు చిన్ననాటి నుంచే విద్యపై ఎక్కువ మక్కువ ఉండేది. 9వ తరగతి వరకు బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ఆయన 10వ తరగతి నరసరావుపేటలో, విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్మీడియేట్ పూర్తి చేశారు. ఆ తరువాత నీట్ పరీక్షలకు హాజరై 425 స్టేట్ ర్యాంక్ సాధించి ఒంగోలు రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నాడు. అనంతరం నీట్ పీజీ పరీక్షల ఫలితాల్లో మంచి ర్యాంక్ సాధించాడని ఆయన తండ్రి ఆంజనేయ రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణరాజును పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

శావల్యాపురంలో భార్గవికి 4946 ర్యాంకు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామానికి చెందిన రెడ్డి కృష్ణ–లక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె రెడ్డి భార్గవి ఆలిండియా పీజీ మెడికల్ నీట్ పరీక్ష ఫలితాల్లో 4946 ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందింది. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్యను శ్రీకాకుళం జిల్లా జెమ్స్ కళాశాల్లో అభ్యసించినట్లు తెలిపారు. తమ తల్లిదండ్రులు సహకారంతో పాటు ఉపాధ్యాయులు స్ఫూర్తితో ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలు సాధించినట్లు భార్గవి తెలిపారు. ఉన్నత విద్య (పీజీ) ప్రభుత్వ పరంగా ఉచిత సీటు కోసం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పీజీ విద్య పూర్తి కాగానే తమ తల్లిదండ్రులు ప్రోత్సాహంతో వైద్యశాల ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించటానికి తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శావల్యాపురంలో శ్రీకృష్ణ–గోపిక వేషాధారణలో చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధ గోవిందుల ఉత్సవమూర్తులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో శనివారం సాయంత్రం శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీల ప్రభుపాదుల 128వ శ్రీవ్యాస పూజ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి ఆదివాసపూజ నిర్వహించారు. శ్రీరాధ,గోవిందుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అలాగే 25వతేది ఆదివారం ఉదయం 7 గంటలకు మహానగర సంకీర్తన, 26వ తేదీ సోమవారం జన్మాష్టమిని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు ఉట్లోత్సవం, రాత్రి 9 గంటలకు ఉత్సవమూర్తులకు 56 రకాల ద్రవ్యాలతో మహాశంఖాభిషేకం, అనంతరం 108 రకాల మధుర భక్ష్యాలతో మహారాజ భోగ నివేదన నిర్వహిస్తారు. అలాగే 27వ తేదీన శ్రీల ప్రభుపాదుల 128వ శ్రీవ్యాసపూజలో భాగంగా ఉదయం 10.30 గంటలకు ప్రభుపాదులకు మహాశంఖాభిషేకం, మహారాజభోగ నివేదన నిర్వహించి భక్తులకు ప్రసాదాలను అందచేయనున్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల్లోని చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికలు, వేషాధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. రత్నకుమారి, కరస్పాండెంట్ కె.వి.ఆర్. మోహన్‌చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి



చిలకలూరిపేట: బీసీల ఆత్మగౌరవ ప్రతీక బీపీ మండల్ జయంతి మహాసభను విజయవంతం చేయాలని శ్రీకృష్ణా యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గోరంట్ల నారాయణ చెప్పారు. పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో సంఘ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని గుంటూరులోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఆదివారం 11 గంటలకు సామాజిక న్యాయం అనే అంశంపై మహాసభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీఎంకే రాజ్యసభ సభ్యులు పశుపతి నాధన్ విల్సన్, అతిధులుగా హైకోర్టు న్యాయవాది వై తాగూర్ యాదవ్, ద్రావిడదేశం అధ్యక్షులు కృష్ణారావు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు, కుమ్మరి క్రాంతి కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలో బీపీ మండల్ సిఫార్సులు అమలు చేయాలని, విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని దేశవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించబడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని బీసీ కులాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గోలి భానుప్రకాశ్, కార్యదర్శి నర్రా నాగరాజు, యలగాల నాగయ్య, ఆరాధ్యుల రామకృష్ణ, పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి స్కాలర్‌షిప్‌లు పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రముఖ బహుళజాతి పురుగుమందుల కంపెనీ బయోస్టాట్ ఆధ్వర్యంలో స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. నాదెండ్ల మండలం తూబాడు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఒక్కొక్కరికీ రూ.2500 చొప్పున 20 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంపెనీ రీజనల్ మేనేజర్ సిహెచ్ నాగభూషణం మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు కంపెనీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారని, వాటిని విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ, కంపెనీ ప్రతినిధులు సతీష్ కుమార్, రామబ్రహ్మం, అంజయ్య, ఎ.కాలేషా, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



గుంటుపాలెంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏవో రామారావు

శావల్యాపురం: రైతులు సాగు చేసిన పంటలను పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలు ఈ–పంట నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. శనివారం మండలంలోని గుంటుపాలెం, కారుమంచి, మతుకుమల్లి గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలను తనిఖీ చేసి రైతులకు అందించుతున్న సేవలను పరిశీలించి అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 190 ఎకరాలు సాగుకు ఏరియాను గుర్తించగా 150 ఎకరాలు సాగు చేసినట్లు తెలిపారు. పంట నమోదు చేయు విధానాన్ని వీఏఏలకు సమగ్రంగా వివరించారు. పంటలు సాగు రైతులందరు సత్వరమే రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలకు సమాచారం తెలపాలన్నారు. పంట నమోదు చేసిన రైతులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు. సెప్టెంబరు 15 నాటికి ఖరీఫ్ సీజను ముగుస్తుందన్నారు. వ్యవసాయ పరమైన ఇబ్బందులు రైతులు పడకుండా ఉండటానికి నిరంతరం రైతుసేవా కేంద్రం వీఏఏలు అందుబాటులో ఉంటారన్నారు.

లారీ బ్యాటరీలు చోరీ



రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పై పార్కింగ్ చేసిన లారీ నుంచి బ్యాటరీలను దొంగిలించిన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. కారంపూడి నుంచి బుచ్చినాయుడు కండ్రికకు లారీ సిమెంట్ లోడ్‌తో బయలుదేరింది. లారీ డ్రైవర్ రోశయ్య లారీను మర్రిచెట్టుపాలెం సమీపంలోకి రాగానే రోడ్డు ప్రక్కన పార్కింగ్ చేసి ఆ గ్రామంలోని తన ఇంటికి వెళ్లాడు. ఇంట్లో భోజనం చేసి తిరిగి లారీ వద్దకు రాగానే రెండు బ్యాటరీలు కనపడ లేదు. ఈ మేరకు గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీలను దొంగిలించారని రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్ రోశయ్య ఫిర్యాదు చేశాడు.

మురుగు, చెత్త కనిపిస్తే ఉపేక్షించను

నరసరావుపేట: పట్టణంలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, ఎక్కడా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇచ్చేదిలేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలో శనివారం తెల్లవారుజామున పారిశుధ్య నిర్వహణ పనుల్ని పరిశీలించారు. శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు వెళ్లారు. పరిశుభ్రతకు మున్సిపల్ కార్మికులు పెద్దపీట వేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల ఆరోగ్యం మున్సిపల్ కార్మికుల చేతుల్లోనే ఉంటుందని అన్నారు. మున్సిపల్ కాంట్రాక్టర్ క్రాంతి కుమార్, సంజీవరావు పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు డాక్టర్ సృజన

నరసరావుపేట రూరల్: వల్లప్పచెరువు రోడ్డు లోని ఇంటిగ్రేటెడ్ హై స్కూల్‌లో డాక్టర్ ఎంవీరెడ్డి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబి రం నిర్వహించారు. ఆ సుపత్రి వైద్యులు డాక్టర్ ఎల్. సృజన వైద్య శిబిరంలో పాల్గొని విద్యార్థులకు, ఉపాధ్యా యులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 135 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ నిర్వాహకురాలు ఏపీవి ఇందిరా, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పీర్ ఎడ్యూకేటర్స్ ఎంపిక



ఎడ్యూకేటర్స్‌తో ఉపాధ్యాయులు

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలలో శనివారం ఆరోగ్య సబ్ సెంటర్ ఆధ్వర్యంలో పీర్ ఎడ్యూకేటర్స్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన పీర్ ఎడ్యూ కేటర్స్‌కు టోపీలు, కోట్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు ఫ్లోరోసిస్, స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. పాఠశాలలోని బాల బాలికలకు టీడీ టీకాలు వేశారు. పిల్లల్లో రక్త హీనత నివారణపై అవగాహన కల్పించారు. ఎన్‌డీటీ కార్యక్రమంలో భాగంగా ఎంవీ పరీక్షలు చేశారు. పోషక పదార్థాలు ఉన్న ఆకు కూరలను ఎక్కువగా తినాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.